ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
గురువారం 8 ఆగస్టు 2024



- కుప్పం చెక్‌పోస్టులో పట్టుబడ్డ గ్రానైట్ లారీ
- పైపాళ్యం వాహనంతో బెంగళూరునుంచి తమిళనాడుకు తరలింపు
- వాహనంపై 'పుంగనూరు' పేరు
- అంతా సక్రమమేనని మైనింగ్ అధికారుల సర్టిఫై





గ్రానైట్ రవాణా చేస్తూ పట్టుబడ్డ లారీ

అయినా.. అనుమానాలు మిగిలే ఉన్నాయ్!



రాత్రివేళ గ్రానైట్ లారీకి ఎస్కార్టుగా వచ్చిన కారు

ఇతర రాష్ట్రాల పేరుతో కుప్పంనుంచి గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోందా? అధికార యంత్రాంగంతోపాటు స్థానిక రాజకీయ మంత్రాంగం కూడా దానికి సహకరిస్తోందా? కుప్పంలో పట్టుబడ్డ గ్రానైట్ లారీ ఈ ప్రశ్నలను ప్రశ్నలుగానే మిగిల్చేసింది. కారణం.. ఆ లారీ కుప్పం మండలం పైపాళ్యం గ్రామవాసులకు చెందినది కావడం. పైగా లారీపై 'ఎంఎల్‌ఆర్, పుంగనూరు (ఏపీ)' అని రాసి ఉండడం. బెంగళూరునుంచి తమిళనాడు వెళ్తున్నట్లుగా పర్మిట్ ఉన్న గ్రానైట్ రవాణాకు భూగర్భ గనుల శాఖ అధికారులు సర్టిఫికెట్ ఇచ్చేశారు. అంతా సక్రమంగానే జరుగుతున్నదని నిర్ధారణ చేసి, వదిలేశారు.

\- కుప్పం

కుప్పం మండలం నడిమూరు చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి పది గంటల ప్రాంతంలో ఒక గ్రానైట్ లారీని సిబ్బంది ఆపారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి నుంచి తమిళనాడుకు గ్రానైట్ తీసుకుని వెళ్తున్నట్లు పర్మిట్‌ను లారీ డ్రైవర్ చూపారు. అయినా అనుమానించిన పోలీసులు గ్రానైట్ సహా లారీని తీసుకొచ్చి కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో ఉంచారు. లారీ మీద 'ఎంఎల్‌ఆర్, పుంగనూరు (ఏపీ)' అని ఉండడం దీనికి ప్రధాన కారణం. ఈ గ్రానైట్ లారీ విషయంలో బుధవారం ఉదయం ఎక్కడెక్కడినుంచో పోలీసులకు ఫోన్లు వచ్చాయి. సాయంత్రం దాకా తర్జనభర్జనలు సాగాయి. స్థానిక అధికార పార్టీ నేతలు కొందరు ఇందులో ఇన్వాల్వ్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, పలమనేరు భూగర్భ గనుల శాఖ ఏడీ వేణుగోపాల్ సిబ్బందితో కలిసి సాయంత్రం కుప్పం చేరుకున్నారు. పట్టుబడిన గ్రానైట్‌ను పరిశీలించారు. కర్ణాటక నుంచే గ్రానైట్ రవాణా అవుతున్నదని, పర్మిట్ కూడా సక్రమమేనని సర్టిఫై చేసి లారీని వదిలేశారు.

మిగిలిపోయిన అనుమానాలివీ

- గ్రానైట్ రవాణా చేస్తున్న లారీ కుప్పం మండలం పైపాళ్యం గ్రామానికి చెందిన వారిది. లారీ యజమాని బేట్రాయన్‌తోపాటు డ్రైవర్ నరసింహన్ కూడా పైపాళ్యం గ్రామవాసులే. మరి ఎక్కడో కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లినుంచి గ్రానైట్ రవాణాకోసం కుప్పంలోని పైపాళ్యం గ్రామానికి చెందిన లారీ ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో తెలియదు.
- లారీ తమిళనాడు రిజిస్ట్రేషన్ బండి. టీఎన్ 52, బి-7299 నెంబర్‌తో ఉంది. కానీ లారీ బాడీకి కుడివైపు 'ఎంఎల్‌ఆర్, పుంగనూరు (ఏపీ)' అని రాసి ఉంది. పైపాళ్యం వాసిది బండి అయినప్పుడు పుంగనూరు పేరు ఎందుకు రాసి ఉందో సమాధానం లేదు.
- ఇక, గ్రానైట్ లారీకి ముందువైపు ఎస్కార్టుగా ఒక కారు ప్రయాణించడం. సాధారణంగా గ్రానైట్, ఎర్రచందనం వంటివి అక్రమ రవాణా చేస్తున్న వాహనాల ముందు మాత్రమే ఎస్కార్టుగా ఇటువంటి కార్లు వెళ్తుంటాయి. ఎక్కడైనా పోలీసులు ఉన్నారా, చెక్‌పోస్టుల్లో తాము మామూళ్లిచ్చేవాళ్లు కాకుండా వేరే సిబ్బంది ఉన్నారా గమనించి అందుకు అనుగుణంగా వాహనాలను దారి మళ్లించడం ఈ ఎస్కార్టు కారులోని వ్యక్తుల ప్రధాన బాధ్యత. మరి మంగళవారం రాత్రి పట్టుబడ్డ గ్రానైట్ లారీ పర్మిట్ నకిలీది కాకుండా నిజమైనదే అయితే ఎస్కార్టుగా కారు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందన్నది మూడో అనుమానం. వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికార యంత్రాంగం మీద ఉంది.

అది కర్ణాటకలో లభించే గ్రానైటే

రవాణా అవుతున్న గ్రానైట్ కర్ణాటక రాష్ట్రంలో లభించే రకమే. కుప్పంలో అటువంటి గ్రానైట్ దొరకదు. పర్మిట్ కూడా సక్రమమైనదే.

\- భూగర్భ గనుల శాఖ ఏడీ వేణుగోపాల్

90,287 మందికి కొత్త పాస్ పుస్తకాలు

- మూడు నెలల పాటు 22ఏ జాబితా భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల
- జిల్లాలో 6,939 ఎకరాలకు అమలు
- అక్టోబరు 1 నుంచి మద్యం నూతన పాలసీ
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు

చిత్తూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరింది. రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాల మీద ఆయన ఫొటోలు వేసుకుంది. ఈ పాసుపుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్ర కలిగిన పుస్తకాలను ఇస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారు. కొత్త నమూనా పాసుపుస్తకాన్ని విడుదల చేశారు. తాజాగా బుధవారం జరిగిన కేబినేట్ మీటింగులో రాజముద్రతో కొత్త పాసు పుస్తకాల పంపిణీకి ఆమోదం లభించింది. మూడు విడతల్లో 329 గ్రామాల్లో రీసర్వే జరగ్గా.. 90,287 మంది రైతులకు జగన్ ఫొటోతో పాసుపుస్తకాలను అందించారు. త్వరలో వాటన్నింటినీ రద్దు చేసి రాజముద్రతో కొత్తవి అందించనున్నారు. అలాగే జగన్ పేరు, ఫొటోతో ఉండే సర్వే రాళ్లను కూడా తొలగించేందుకు కేబినేట్ ఆమోదించింది. 'మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో మంటలు' కారణంగా మూడు నెలల పాటు 22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్లను ఆపేసింది. మన జిల్లాలో ఐదేళ్ల వైసీపీ పాలనలో 6939 ఎకరాల్ని 22ఏ జాబితా నుంచి తొలగించారు. వీటిలో 1819 ఎకరాల రిజిస్ట్రేషన్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇక మూడు నెలల పాటు ఈ 22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్లు జరగవు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగిన 1819 ఎకరాల్ని కూడా మరోసారి పరిశీలించనున్నారు. మొత్తం 6939 ఎకరాల్ని జాబితా నుంచి తొలగించగా.. వాటిలో సగభాగం 3030 ఎకరాలు ఒక్క పుంగనూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా.. అక్టోబరు ఒకటి నుంచి నూతన పాలసీ ప్రవేశపెడుతున్నట్లు కేబినేట్‌లో తెలిపారు. వైసీపీ హయాంలో అందించిన నాసిరకం కాకుండా నాణ్యత కలిగిన మద్యాన్ని అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నూతన మద్యం విధానం ఎలా ఉంటుందోనని ఆ రంగ వ్యాపారుల్లో ఉత్సుకత నెలకొంది.

అక్రమ పట్టాల అంశంపై క్రిమినల్ కేసు?

దీని వెనుక తహసీల్దార్, వీఆర్వో సహా కొందరు వైసీపీ నేతలు

చిత్తూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పూర్వ తహసీల్దార్ మురళీమోహన్ ఎన్నికలకు కొన్నాళ్ల ముందు సుమారు 450 మందికి అక్రమంగా పట్టాలు ఇచ్చారు. ఈ కారణంగా ఆయనకు తాజాగా జరిగిన బదిలీల్లో ఉన్నతాధికారులు పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ పట్టాల వ్యవహారంలో క్రిమినల్ కేసు నమోదు చేసి, త్వరలో విచారించనున్నారు. ఈ మేరకు అంతా సిద్ధమైంది. తహసీల్దార్ మురళీతో పాటు ఆ పట్టాలన్నీ రాసిన సచివాలయ మహిళా వీఆర్వో మీద కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ పట్టాలతో కొందరు వైసీపీ నేతలు వ్యాపారం చేసినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఉద్యోగులతో పాటు బయటి వ్యక్తులపైనా కేసులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

విజన్.. కుప్పం!

డాక్యుమెంట్ రూపకల్పనలో కడా కసరత్తు

16న సీఎం చంద్రబాబు వద్ద ప్రజెంటేషన్



విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సమావేశమైన అధికారులు

కుప్పం, ఆగస్టు 7: అభివృద్ధి మోడల్‌గా కుప్పాన్ని తీర్చిదిద్దే పని మొదలైంది. ఇందుకు అనుగుణమైన విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) నిమగ్నమైంది. ఈనెల 12లోగా దీనిని పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కడా పీడీ ప్రజెంటేషన్ చేయనున్నారు. గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో కుప్పం అభివృద్ధి పదేళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్న భావన నియోజకవర్గ ప్రజలలో బలంగా ఏర్పడింది. అందుకే ఈ పదేళ్ల వెనుకబాటుతనాన్ని కవర్ చేసుకుంటూ, వచ్చే పదేళ్లను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిని సాకారం చేయడానికి సీఎం సంకల్పించారు. సమర్థుడైన యువ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌కు కడా సారథ్య బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, ఇంకా ప్రభుత్వంలోని ప్రతి విభాగానికి ప్రస్తుతం కుప్పం విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములవుతున్నాయి. రెండు రోజులుగా రోజుకు రెండుమూడు ప్రభుత్వ శాఖాధికారులు, నైపుణ్యం కలిగిన ప్రైవేటు ఏజెన్సీలతో కలిసి కడా కార్యాలయంలో సమావేశమై సమీక్షలు జరుపుతున్నారు. బుధవారం ఆర్అండ్‌బీ, ఏపీఐఐసీ తదితర ప్రభుత్వ విభాగాల సమావేశం జరిగింది. విజన్ డాక్యుమెంట్ పూర్తయిన తర్వాత స్థానికులైన మేధావులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశమై సలహాలు, సూచనలు తీసుకుంటారు. అనంతరం ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో విజన్ డాక్యుమెంట్‌పై కడా పీడీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి సూచనల ప్రకారం మార్పుచేర్పులుంటాయి. రాబోయే మూడేళ్లలో కుప్పం నియోజకవర్గాన్ని నమూనా నియోజకవర్గంగా అభివృద్ధి చేసి చూపించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. తర్వాత రాష్ట్రం మొత్తం కుప్పం మోడల్‌గా అభివృద్ధి చేపడతారు.

డాక్యుమెంట్‌లో ఏముంటుందంటే..

కుప్పం నియోజకవర్గ అభివృద్ధికోసం ఏయే ప్రభుత్వ శాఖలనుంచి ఏయే పనులు చేపట్టవచ్చు, ఆ పనులు త్వరితగతిన, మరింత నైపుణ్యంగా, మెరుగ్గా, మంచి ఫలితాలు ఇచ్చేలా వినూత్నమైన ఆలోచనలు ఏమిటి, అటువంటి వినూత్న ఆలోచనలు కార్యరూపంలో ఎలా పెట్టొచ్చు వంటి అంశాలు విజన్ డాక్యుమెంట్‌లో చోటు చేసుకుంటాయి. మురుగు నీటి కాలువల నిర్మాణంనుంచి కార్గో ఎయిర్ పోర్టు దాకా, వ్యవసాయం నుంచి సెజ్ (పారిశ్రామికవాడ అభివృద్ధి) దాకా ఇందులో పలు అంశాలు చోటు చేసుకోనున్నాయి. ఆయా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి ఒక అంచనా బడ్జెట్‌ను కూడా డాక్యుమెంట్‌లో పేర్కొంటారు. ఈ విజన్ డాక్యుమెంట్ అమల్లోకి వస్తే సంభవించబోయే అభివృద్ధి ఫలాలు ఎలా ఉంటాయో కూడా అంచనా వేస్తారు. కుప్పం నియోజకవర్గంలో జీరో పావర్టీ, తలసరి ఆదాయం పెంపు, ఉద్యోగ ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబనతోపాటు సకల రంగాల అభివృద్ధి అంతిమంగా విజన్ డాక్యుమెంట్ లక్ష్యం.

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 7: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం జరగనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పాఠశాలలు 2463 ఉన్నాయి. రెండేళ్ల కాలపరిమితితో జరిగే ఈ కమిటీ ఎన్నికలకు ఆగస్టు ఒకటిన ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పాఠశాలల్లో పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేస్తారు. తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తదితరాలను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయి. ఎన్నికల అధికారిగా హెచ్‌ఎంలు వ్యవహరించనున్నారు. గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ సభ్యులచే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లచే ప్రమాణస్వీకారం, 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

త్వరలో డీసీసీబీ విభజన

శాఖలు, సింగిల్ విండోలు కూడా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)లనూ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో చిత్తూరు డీసీసీబీని విభజించి తిరుపతి కేంద్రంగా మరొకటి ఏర్పాటు కానుంది. కొన్ని సింగిల్ విండోలు, శాఖలు అన్నమయ్య జిల్లాలో కలవనున్నాయి. అమరావతిలో ఇటీవల జరిగిన డీసీసీబీ సీఈవోల సమావేశంలో ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. 105 సంవత్సరాల చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ప్రధాన కార్యాలయంతో కలిపి 20 శాఖలు, 75 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2940 కోట్ల వ్యాపారం నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీ ఏడో స్థానంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించినా డీసీసీబీ మాత్రం ఇప్పటికీ ఉమ్మడిగానే కొనసాగుతోంది. దీనినీ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ శాఖలను, సింగిల్ విండోలను కూడా జిల్లాలవారీగా విభజించనున్నారు. ఈ ఏడాది ఆఖరిలోగా విభజన ప్రక్రియను పూర్తిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాస్తవానికి ఇదివరకే డీసీసీబీ పాలకవర్గాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో చిత్తూరు జిల్లా డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈయన డిసెంబరు వరకు కొనసాగనున్నారు. ఆలోగా బ్యాంకు విభజన ప్రక్రియ పూర్తిచేసి సింగిల్ విండోలకు, డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించాలా? లేక నామినేటెడ్ పద్ధతుల్లో త్రిసభ్య లేదా ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించాలా అన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.



తిరుపతి డీసీసీబీకి 14 శాఖలు, 23 విండోలు

విభజన నేపథ్యంలో చిత్తూరులోని ప్రధాన కార్యాలయంతో కలిసి 20శాఖలు, 37 సింగిల్ విండోలతో చిత్తూరు డీసీసీబీ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసే తిరుపతి జిల్లా డీసీసీబీలో 14 శాఖలు, 23 సింగిల్ విండోలు ఉంటాయి. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాకు ఆరు శాఖలు, 15 సింగిల్ విండోలు విలీనం కానున్నాయి. విభజనపై సాధక బాధకాలను ఉన్నతాధికారులు త్వరలో పరిశీలించనున్నట్లు తెలిసింది.

- 'డాయ్ యాప్' ఎఫెక్ట్

పలమనేరు మెప్మాలో 19మంది తొలగింపు

- ఎఫ్ఐఆర్ నమోదుకు కలెక్టర్ ఆదేశం

పలమనేరు/చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: పలమనేరులో కలకలం సృష్టించిన 'డాయ్ యాప్' ఘటనలో మెప్మాలోని ఐదుగురు సిబ్బంది, 14 మంది ఆర్పీలను (రీసోర్సుపర్సన్లు) విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరు సుమిత్‌కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డాయ్ యాప్‌లో నగదు డిపాజిట్ చేస్తే రెట్టింపు చెల్లిస్తామంటూ ప్రజలను మోసగించిన విషయం తెలిసిందే. ఈ ఘటన గతనెల 25వ తేదీన వెలుగు చూసింది. ఈ యాప్‌ను మెప్మాలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ స్థానికంగా ప్రజల్లోకి తీసుకెళ్లాడు. మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల ద్వారా రూ.కోట్లలో డిపాజిట్లు కట్టించినట్లు వెలుగులోకి వచ్చింది. కాగా, డాయ్ యాప్ బాధితుల ఫిర్యాదుల మేరకు కలెక్టరు సుమిత్‌కుమార్ స్పందించి ముగ్గురు అధికారులతో విచారణ జరిపించారు. గతనెల 29, 30 తేదీల్లో వీరు బాధితులతో మాట్లాడి.. ఫిర్యాదులు తీసుకున్నారు. వీటి ఆధారంగా పీడీ రాధమ్మ ఒక నివేదికను.. ఇద్దరు అధికారులు మరో నివేదికను కలెక్టరుకు సమర్పించారు.డాయ్ యాప్‌లో ప్రజలు మోసపోయేందుకు కారణంగా భావించిన పలమనేరు మెప్మా మేనేజర్ ఉమేష్, డేటాఎంట్రీ ఆపరేటర్ రాజేష్, మెప్మా కార్యాలయంలో పనిచేసే మయూరి,జయంతి, గుల్షన్‌తో పాటు 14మంది ఆర్పీలను..మొత్తం 19మందిని విధులనుంచి తొలగించారు. వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పలమనేరు డీఎస్పీని ఆదేశించారు.

అత్యాశకు పోయి..

మెప్మాలోని ఆర్పీల వల్లే తామంతా మోసపోయినట్లు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. మెప్మా సిబ్బంది, అధికారుల ఒత్తిడిమేరకు తాము పెట్టుబడులు పెట్టడంతో పాటు మరి కొందరితో పెట్టించినట్లు ఆర్పీలూ వివరణ ఇచ్చారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చాలన్న ధ్యేయంతో పనిచేయాల్సిన మెప్మా అధికారులు, ఆర్పీలు అత్యాశకు పోయి డాయ్‌యాప్‌కు దాసోహం కావడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. అందుకనే వీరిని విధులనుంచి తప్పించారు.

సీవీఎస్వో బాధ్యతల స్వీకారం



టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకమండపంలో బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించాక గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.సీవీఎస్వో శ్రీధర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు శ్రీవారి ఫొటోతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం సీవీఎస్వో ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..టీటీడీలోని అన్ని విషయాలనూ అవగాహన చేసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తానని, ఆ శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి





పొగడచెట్టుకు హారతి

పురుశైవారితోటలో మలయప్ప

భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది కూడా టీటీడీ తిరువాడిపురం శాత్తుమొరను వేడుకగా నిర్వహించింది.ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ వెనుకభాగంలోని పురుశైవారి తోటకు వేంచేశారు.నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పొగడచెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారికి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లు మాడవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు.ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అంతరిక్షంపై అవగాహన పెంచుకోండి

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో రూపొందించే ఉపగ్రహాలను గురించి విద్యార్థులకు షార్ డైరెక్టర్ వివరించారు. సమాజం కోసం ఇస్రో చేపడుతున్న ప్రయోగాలు, కార్యక్రమాల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం అంతరిక్ష ప్రయోగాల గురించి చంద్రయాన్-3 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కల్పన చంద్రయాన్ వివరించారు.శాస్త్రవేత్తలు రఘురామ్, శంభుప్రసాద్, సీవీఎస్ కిరణ్, షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట



సమావేశంలో ప్రసంగిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

రక్తమోడిన తిరుమల ఘాట్

• బస్సు కిందపడి ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం



బస్సు కింద, పక్కన మృతదేహాలు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ దర్శనమిచ్చే తిరుమల ఘాట్‌రోడ్డు బుధవారం మధ్యాహ్నం రక్తపు మరకలతో భయానకంగా మారింది. స్వామి క్షేత్రానికి చేరుకున్నామని ఆనందపడుతున్న భక్తులను ఆగిన బస్సు, దాని కింద రెండు మృతదేహాలు ఆందోళనకు గురిచేశాయి.మొదటిఘాట్ రోడ్డులోని చివరి మలుపు అంటే తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీప ప్రాంతంలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద లభించిన గుర్తింపుకార్డుల ఆధారంగా బైక్ నడుపుతున్న వ్యక్తి తమిళనాడులోని పల్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28)గా తేలింది. ఇక, వెనుకభాగంలో కూర్చుని మృతి చెందిన మహిళ తిరువన్నామలై జిల్లాలోని చెంజాం తాలూకా, మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా పోలీసులు గుర్తించారు. ఉదయం 10.45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, మధ్యాహ్నం తర్వాత మృతదేహాలను పోలీసులు, హెల్త్ సిబ్బంది బస్సు కింద నుంచి తొలగించి అశ్విని ఆస్పత్రికి తరలించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ సంఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో బస్సు డ్రైవర్ కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశాలపై ఆరా తీస్తున్నారు.కాంతారావు మీడియాతో మాట్లాడుతూ.. బైక్‌పై వచ్చిన వారు తొలుత రైట్‌లో వచ్చేందుకు ప్రయత్నించి తర్వాత వేగంగా ఎడమవైపుకు వచ్చారని తెలిపారు. కనీసం హార్న్ కూడా కొట్టలేదని, బస్సును ఢీకొట్టి వారే కిందకు వెళ్లిపోయారన్నారు. మలుపు కావడంతో బస్సును వేగంగా కూడా నడపలేదని, బైక్‌పై వచ్చిన వారే మితిమీరిన వేగంతో వచ్చారని వివరించాడు. బస్సు ప్రమాదానికి కారణం ఎవరనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా కొద్దిరోజులుగా ఏసీ బస్సులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ముందు వెళుతున్న కార్లను, ద్విచక్రవాహనాలను సైతం ఓవర్‌టేక్ చేస్తున్నాయనే ఫిర్యాదులున్నాయి. భక్తుల కార్లతో పాటు టీటీడీ అధికారుల వాహనాలకు కూడా సైడ్ ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.పర్యావరణ పరిరక్షణ నినాదంతో తిరుమల-తిరుపతి మధ్య ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 62 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. వీటి డ్రైవర్లను బస్సు తయారీ సంస్థ అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించుకుంది. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినప్పటికీ ర్యాష్ డ్రైవింగ్‌తో విమర్శలపాలవుతున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతిలో గతనెల 11వ తేదీన 'తిరుమల ఘాట్‌లో ఏసీ బస్సుల దూకుడు' అనే శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. అయినప్పటికీ వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.ఎలక్ట్రిక్ బస్సులన్నిటికీ ముందు, వెనుకభాగంలో సీసీ కెమెరాలున్నప్పటికీ వాటిని ఆన్ చేయకుండా బస్సులు నడుపుతున్నట్టు బుధవారం జరిగిన ఘటనతో వెలుగు చూసింది.



బస్సు డ్రైవరును విచారిస్తున్న పోలీసులు

భాకరాపేట ఘాట్‌లో నడిరోడ్డుపై లారీ బోల్తా

చంద్రగిరి ఆగస్టు 7: చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌లో బుధవారం సాయంత్రం నడిరోడ్డుపై ఓ లారీ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి.వరదయ్య పాళెం మండలం కలత్తూరుకు చెందిన 11మంది వ్యాపారులు, కూలీలు ఎర్రావారిపాళ్యం మండలం వెళ్లారు.ఆ మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం సేకరించి లారీలో వేసుకొని వస్తుండగా భాకరాపేట ఘాట్‌లో అదుపుతప్పి రోడ్డుపై లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లయ్య, మునిభూషణం, మణి, బాలయ్య గాయపడ్డారు. నవీన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





బోల్తా పడిన లారీ (ఇన్‌సెట్‌లో) నవీన్ కుమార్ మృతదేహం

బోనమందలో ఏనుగుల హల్ చల్

సోమల, ఆగస్టు 7: పేటూరు పంచాయతీ బోనమంద సమీపంలో బుధవారం పట్టపగలు ఏనుగుల గుంపు హల్ చల్ చేసింది. పెద్దఉప్పరపల్లె రైతులు పొలాలకు వెళ్తుండగా రోడ్డుపై ఏనుగుల గుంపును చూశారు. వెంటనే వెనుతిరిగి వచ్చేశారు. దుర్గం కొండ అడవుల్లో నీటి నిల్వల కోసం ఆ ప్రాంతంలోనే ఇవి మకాం వేసినట్లు రైతులు భావిస్తున్నారు. కొన్ని మామిడి తోటల్లో కాయలు కోతలు కోయాల్సి ఉన్న నేపథ్యంలో వీరు ఆందోళన చెందుతున్నారు. మందుల పిచికారీతో కోతలు ఆలస్యవుతున్నాయంటున్నారు.

నేటి నుంచి సర్పంచి, కార్యదర్శులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ 2024-25 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై తొలి విడతలో గురువారం నుంచి మూడ్రోజులపాటు మండల స్థాయిలో సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు జరుగుతాయని జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర కో-ఆర్డినేటర్ ఐ.ఆర్.షణ్ముగం తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్యం, ఎల్ఈడీ వీధి దీపాలు, ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రెండో విడత శిక్షణా తరగతులు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

పీఎం ఆవాస్ యోజన లక్ష్యం పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న 22,125 గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేస్తే లబ్ధిదారులు ఆసక్తి చూపుతారని అధికారులు చెప్పడంతో మెప్మా, డీఆర్డీఏ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణాలు మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ పీడీ పద్మనాభం, ఈఈలు, డీఈలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు వెనక్కి

చిత్తూరు రూరల్, ఆగస్టు 7: ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వారిని తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు నుంచి నెల్లూరు, కడప జిల్లాలకు వెళ్లిన 30 మంది ఎంపీడీవోలు వారి స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన యంత్రాలు, షెడ్ల ఏర్పాటుకు ఆర్థికసాయం చేయడానికి కృషి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో 10వ జాతీయ చేనేత దినోత్సవం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. చేనేత కార్మికులు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులపై వినియోగదారులకు అవగాహన పెంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేద చేనేత కార్మికులకు ఆరోగ్యభద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్, ప్రభుత్వాస్పత్రులు, జడ్పీ, ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. 10మంది నేతన్నలను కలెక్టర్ సన్మానించారు. చేనేత శాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

30మందికి వాంతులు, విరేచనాలు



ఇళ్ల వద్దనే వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళ్యం, ఆగస్టు 7: బంగారుపాళ్యం దళితవాడలో 30 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి, చికిత్స అందిస్తున్నారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై కొందరికి వాంతలు, విరేచనాలు అయ్యాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి, ప్రైవేటు ఆస్పత్రులలో కొందరు చికిత్స పొందుతున్నారు. మరికొందరికి గ్రామంలోనే క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి గ్రామాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి శాంపిల్‌ను పరిశీలించడానికి తిరుపతి ల్యాబ్‌కు పంపినట్లు డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ డీఎం అండ్‌హెచ్‌వో ప్రభావతితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన సేవలందించాలని కోరారు.

సీఐ అక్రమాలపై విచారణ జరపండి



డీఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఆగస్టు 7: పలమనేరు సీఐ చంద్రశేఖర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండు చేశారు. తమతో పాటు అమాయకులను వేధించడంపైనా విచారించాలన్నారు. ఈ మేరకు వీరు బుధవారం పలమనేరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్పీని కలిసి 'స్పందన' కార్యక్రమం లో ఫిర్యాదు చేశామని తెలిపారు. వైసీపీ పాలనలో ఇసుక అక్రమంగా తరలించినా సీఐ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఇసుక ఉచితమని పదేపదే చెబుతున్నా తాము ఇళ్ల నిర్మాణాలకు ఇసుక తీసుకొస్తుంటే పట్టుకొని కేసులు నమోదు చేస్తామని వేధిస్తున్నారన్నారు. వెంటనే సీఐ చంద్రశేఖర్‌ను సస్పెండ్‌చేసి, అతని అక్రమాలపై విచారణ జరపాలన్నారు. టీడీపీ నాయకులు నాగరాజు, నాగరాజరెడ్డి, పెద్దబ్బ, ఖాజా పీర్, చిన్ని, సుబ్బు, లోకేష్‌ఆచారి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలో జాప్యం ఎందుకో?

పలమనేరు సీఐ చంద్రశేఖర్ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడికి పోస్టింగ్ తెచ్చుకొన్నారు. గతంలోనూ ఈయన ఇక్కడ ఎస్ఐగా, సీఐగా పనిచేస్తూ అధికార వైసీపీకి అంటకాగారు. ఆ పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆయనపై ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో శాంతిపురానికి చెందిన జనార్దన నాయుడు క్వారీని అక్రమంగా అప్పటి ఎమ్మెల్యే స్వాధీనం చేసుకొన్నా సీఐ పట్టించుకోలేదు. ఇప్పుడు వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత తనక్వారీ లోని వాహనాలను సైతం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తరలించుకుపోయారని జనార్దన నాయుడు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. దీంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయమై ఎస్పీ నుంచి ఆదేశాలు వచ్చినా కేసు నమోదు చేయలేదు. ఇంతలా వైసీపీ ముద్రవేసుకొన్న సీఐ చంద్రశేఖర్‌ను ప్రభుత్వం ఎందుకు బదిలీ చేయలేదనే చర్చ ప్రారంభమైంది. సాధారణంగా అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారంటూ ప్రతిపక్షనాయకులు ఆరోపణలు చేయడం, నిరసన కార్యక్రమాలు చేపట్టడం సర్వసాధారణం. ఇక్కడ మాత్రం ఇందుకు భిన్నంగా అధికారపార్టీ నాయకులే సీఐపై ఫిర్యాదులు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా సీఐ బదిలీ జరగక పోవడం విశేషం. కర్నూలు రేంజిలోని 92 మంది సీఐలను బదిలీ చేసినా.. అందులో పలమనేరు సీఐ లేకపోవడంపై టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. తన నియోజకవర్గంలోని ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథరెడ్డి పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వలంటీర్ల వాట్సప్ గ్రూపులు తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: గ్రామ, వార్డు వలంటీర్లు (విధుల్లో ఉన్న.. రాజీనామా చేసిన.. తొలగించిన)కు సంబంధించి వారి హౌస్‌హోల్డ్స్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులన్నిటినీ వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీఅయ్యాయి. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా జిల్లాలో 9412 మంది విధుల్లో ఉన్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 5298 మంది రాజీనామా చేయగా, 4114 మంది ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. వీరికి ఎటువంటి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చేయడంతో పాటు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ సమాచారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేయాలని కూడా అందులో పేర్కొన్నారు. గతంలో పెన్షన్లు వలంటీర్ల ద్వారా వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు నెలలకు సంబంధించిన పెన్షన్లను వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

తిరుమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 66,235 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 26,730 మంది తలనీలాలు సమర్పించారు.

వాన దంచేసింది

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వాతావరణం మారింది. ఈ ఒక్క రోజే 16.8 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. నగరి, నింద్ర, విజయపురం మండలాలు మినహాయించి 29 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వి.కోటలో 83.2, అత్యల్పంగా పాలసముద్రం, చిత్తూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పులిచెర్ల 61.2, రొంపిచెర్ల 44.6, సదుం 42.2, గంగవరం 35.4, బైరెడ్డిపల్లి 35.2, చౌడేపల్లి 34.2, సోమల 24.2, ఐరాల 23.2, వెదురుకుప్పం 20.4, పలమనేరు 16.6, తవణంపల్లె 16.2, పెనుమూరు 15.8, బంగారుపాళ్యం 14.6, గుడుపల్లి 9.2, పూతలపట్టు 9.0, కార్వేటినగరం 7.2, రామకుప్పం 6.8, పుంగనూరు 6.2, గుడిపాల 6.2, పెద్దపంజాణి, గంగాధరనెల్లూరు 4.2, యాదమరి 3.2, చిత్తూరు రూరల్ 3.0, శాంతిపురం 2.8, శ్రీరంగరాజపురం 2.6, కుప్పంలో 2.0 మి.మీ కురిసింది. గతంలో వేసిన వరినాట్లకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

నిత్యావసర సరుకుల తడవకుండా జాగ్రత్తలు



మాట్లాడుతున్న తహసీల్దారు చిట్టిబాబు

కుప్పం, ఆగస్టు 7: నిత్యావసర సరుకులను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు చిట్టిబాబు డీలర్లకు సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన డీలర్లతో సమావేశమయ్యారు. తహసీల్దారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తడవకుండా సరుకులను నిల్వ చేయాలన్నారు. రేషన్ అందలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. డీలర్లు కొన్ని సమస్యలు ప్రస్తావించిడంతో ఈనెల మూడవ వారంలో డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎండీఎం ఆపరేటర్ల ద్వారానే నిత్యాసవరాలను సరఫరా చేయాలన్నారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, డీలర్లు పాల్గొన్నారు.

కృష్ణదేవరాయల చిత్రపటానికి పాలాభిషేకం



సోమల, ఆగస్టు 7: కృష్ణదేవరాయల పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కందూరు బస్టాండ్‌లో బలిజ సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కృష్ణదేవరాయల చిత్రపటాన్ని ఊరేగించారు. స్వీట్లు పంచారు. అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ హరినారాయణ, కోలా రామకృష్ణ, బొజ్జ శ్రీనివాసులు, కామిశెట్టి నగేశ్, లక్ష్మీపతి, పాల సురేశ్, సుబ్బరాయుడు, విశ్వనాథం, రెడ్డి మోహన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక ఫోకస్



ఎద్దుల సంత వీధిలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్

పలమనేరు, ఆగస్టు7 : మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి వీటిని పర్యవేక్షిస్తున్నారు. అక్కడక్కడ ప్రజలు జ్వరాల బారిన పడుతున్న నేపథ్యంలో వారం రోజులుగా పర్యటిస్తూ పారిశుధ్య పనులపై ఫోకస్ పెట్టారు. మురుగునీటి కాలువల్లో పూడిక తీయిస్తున్నారు. కాలువలకు ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. గాంధీనగర్‌లో రోడ్డుకిరువైపులా వేసిన వ్యర్థాలను జేసీబీ సాయంతో మున్సిపల్ ట్రాక్టర్లలో ఎక్కించి తొలగిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొంటున్నారు.

రాచకాలువ ఆక్రమణలను తొలగించాలి



జనావాసాల మధ్య మురుగునీరు

పలమనేరు, ఆగస్టు7 : స్థానిక రాధాబంగ్లా ఏరియాలో రాచకాలువలో ఆక్రమణలు తొలగించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. పాతపేట నుంచి వచ్చే మురుగునీరు, పెద్దచెరువు కలుజునీరు వెళ్లే రాజకాలువలను కొందరు ఆక్రమించుకున్నారు. మరికొందరు రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం రాజకాలువలను కనుమరుగు చేశారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా రాధాబంగ్లా ఏరియాలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచిపోతోంది. అధికారులు స్పందించి రాజకాలువలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అమ్మపాలు బిడ్డకు అమృతంతో సమానం



పులిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కల్లూరు, ఆగస్టు 7: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు అరగంట వ్యవధిలోనే ముర్రుపాలు పట్టించాలన్నారు. ఇవి సంపూర్ణ ఆరోగ్యం ఇస్తాయన్నారు. వీటి ప్రాముఖ్యతను ప్రతి తల్లి తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. ర్యాలీ నిర్వహించారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

సోమల, ఆగస్టు 7: ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టినట్లు ఆశాఖ రాష్ట్ర కౌన్సిలర్ సూర్యప్రకాశ్ తెలిపారు. బుధవారం నంజంపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయులను యూనియన్ నాయకులు కలిశారు. ఉపాధ్యాయ సమస్యలను ఆరా తీశారు. సమస్యలపై నిరంతరం ఎస్టీయూ పోరాటం చేస్తుందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు శివరాం, జ్యోతీశ్వరుడు, ఇమ్రాన్, జగన్‌మోహన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్, హెచ్‌ఎం కుసుమాంబ, రాజేశ్,సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



బొమ్మిదొడ్డిలో చేనేత కార్మికులను సన్మానిస్తున్న తాతయ్యనాయుడు

పలమనేరు, ఆగస్టు7 : మండల కేంద్రంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశులు మాట్లాడుతూ చేనేత రంగం మన సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. భారతీయతకు నిదర్శనమన్నారు. అధ్యాపకులు నందీశ్వరయ్య,చిదంబరం, ఆర్.వెంకటేష్‌బాబు, రుక్మిణి, సురేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. బొమ్మిదొడ్డిలో చేనేత కార్మికులను బీజేపీ కన్వీనర్ తాతయ్యనాయుడు సన్మానించారు.

యువతరం క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్సీ కంచర్ల



సరదాగా బ్యాటింగ్ చేస్తున్న కంచర్ల

కుప్పం, ఆగస్టు 7: యువతరం క్రీడల్లో రాణించి, రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఆకాంక్షించారు. పరమ సముద్రంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మొబైల్ మాయలో యువతరం నిర్వీర్యంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు యువత వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని మైదానంలో ధీరులుగా నిలవాలన్నారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, పరమసముద్రం గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా క్రమశిక్షణతో అడుగులు



కార్యక్రమం ప్రారంభిస్తున్న సునీల్‌రాజ్

కుప్పం, ఆగస్టు 7: విద్యార్థులు లక్ష్యం దిశగా క్రమశిక్షణతో అడుగులు వేయాలని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ అన్నారు. కళాశాలలోని ఫస్టియర్ బీటెక్ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ నిర్వహించారు. విజయవాడ ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ డిపార్టుమెంట్ హెడ్ మాధవన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన టీడీపీ నేత లక్ష్మణరాజు



చౌడేపల్లె, ఆగస్టు7:సీఎం చంద్రబాబును టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు కలిశారు. బుధవారం ఆయన పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డితో కలసి అమరావతిలో సీఎంను కలిశారు. పుంగనూరు రాజకీయ పరిస్థితులపై చంద్రబాబు ఆరా తీసినట్లు వారు తెలిపారు.

24 గంటల్లో జనన ధ్రువీకరణ పత్రాలు



జనన ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కమిషనర్

కుప్పం, ఆగస్టు 7: పురపాలక సంఘంలో దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన పలువురికి జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్ణీత గడువు లోపల సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ అధికారులు,సిబ్బంది

సోమల, ఆగస్టు 7: పలు గ్రామాల్లో విద్యుత్ అక్రమ వాడకంపై విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నవారిపై 92 కేసులు నమోదు చేశారు. రూ.2.81 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ పుల్లా బాలాజీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈలు పూర్ణచంద్రకుమార్, నరసింహమూర్తి, మాధవరావు, నరేంద్ర, ఏఈలు హరినాథ్, చలపతి, కృష్ణయ్య, మహేంద్రరెడ్డి, శ్రీనివాసరావు, ట్రాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



వెంకటరెడ్డి (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు7: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పెద్దపంజాణి మండలం కరసనపల్లె పంచాయతీ మిట్టపల్లికి చెందిన వెంకటరెడ్డి(96) చిన్న కొండచెర్లలోని కుమార్తె సరోజమ్మ ఇంట్లో నెలరోజులుగా ఉంటున్నాడు. బుధవారం నడిచి వెళుతుండగా ఓ ప్రవేటు బస్సు ఢీకొంది. వెంకట రెడ్డి అక్కడక్కడే మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ జయరామయ్య తెలిపారు.

కేంద్ర మంత్రి దృష్టికి వైసీపీ ఆక్రమాలు



కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నను కలిసిన ఆయూబ్‌ఖాన్

పుంగనూరు, ఆగస్టు7: స్థానిక రాయల చెరువు వంకను కొందరు వైసీపీ నాయకులు ఆక్రమించి భవనాలు నిర్మించారని కేంద్ర రైల్వేసహాయ మంత్రి వీరన్న సోమన్నకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు ఆయూబ్ ఖాన్ తెలిపారు. బుధవారం బెంగళూరులో మంత్రిని కలిశామన్నారు. ఆక్రమించిన వంక, ప్రభుత్వ భూములను కాపాడాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించినట్లు ఆయూబ్‌ఖాన్ పేర్కొన్నారు.

పాలేటమ్మవారి ఊరేగింపు



సోమల, ఆగస్టు 7: నెల్లిమంద పాలేటమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి అమ్మవారిని ఎగువపల్లెలో ఘనంగా ఊరేగించారు. ఈనెల 11, 12 తేదీలలో అమ్మవారి జాతరను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం నుంచి నెల్లిమంద, సోమల, వల్లిగట్ల తదితర పంచాయతీల్లో అమ్మవారికి గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు.

శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవం



సదుం, ఆగస్టు 7: మండల రాయల్ పీపుల్ ఫ్రంట్ (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు కూడలిలో బుధవారం శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. రాయలవారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, రామయ్య, ఆర్‌బీ రమేశ్ కుమార్, వెంకటరత్నం, దండపాణి రాము, రమణ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఈఆర్‌ఓ భవనం



పెచ్చులూడిన పైకప్పు



ఇబ్బందికర పరిస్థితిలోనే సిబ్బంది విధి నిర్వహణ

పలమనేరు, ఆగస్టు7 :స్థానిక ఈఆర్‌ఓ కార్యాలయ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. 1999లో జన్మభూమి పథకం కింద 30 శాతం శ్రమదానంతో రూ.50 లక్షల వ్యయంతో విద్యుత్ సంస్థ సేవాకేంద్ర సముదాయ భవనం నిర్మించారు. నాలుగేళ్ల తరువాత దీనిపైనే ఈఆర్‌ఓ కార్యాలయాన్ని నిర్మించారు. నాశిరకంగా నిర్మించడంతో పాటు దీనిపైనే అధికారులు సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆరేళ్ల క్రితం సోలార్ విద్యుత్ కోసం కాంట్రాక్టరు ప్యానల్స్ ఏర్పాటుకు భవనం పైకప్పుపై పలుచోట్ల డ్రిల్లింగ్ చేశారు. దీంతో భవనం పైకప్పు బీటలు బారింది. పైకప్పుపైకి వెళ్లేందుకు కనీసం మెట్లు కూడా లేవు. సోలార్ ప్యానల్స్ పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పునుంచి నీరు లోపలకు వస్తోంది. పైకప్పు బాగా తడిసిపోయింది. పైకప్పు కింది భాగాన ఈఆర్‌ఓ కార్యాలయ పాత రికార్డులు తడిసి ముద్దయిపోతున్నాయి. కొన్ని గదుల్లో పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు పడిపోతుందా అన్న విధంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

పరిశీలించిన సివిల్ ఇంజినీర్లు

శిథిలావస్థకు చేరిన భవనాన్ని తిరుపతిలోని విద్యుత్ శాఖ సివిల్ ఇంజినీర్లు వారం క్రితం పరిశీలించారు. పైకప్పు మాత్ర మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈఆర్‌ఓ కార్యాలయంతో పాటు ఏడీఈ కార్యాలయానికి కూడా కొత్త భవనం నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ భవనంలోనే ఏడీఈ కార్యాలయముంది. నాలుగు మండలాల వినియోగదారులకు సేవలందిస్తున్న విద్యుత్ రెవెన్యూ, ఏడీఈ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరముంది. నిర్మాణానికి సువిశాల స్థలం ఉన్నందున అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రారంభానికి ముస్తాబైన అన్న క్యాంటీన్



పలమనేరు, ఆగస్టు7 : అన్న క్యాంటీన్ పూర్వవైభవాన్ని సంతరించుకొంటోంది. ఈనెల 15న దీనిని పునఃప్రారంభించేందుకు అధికారులు వడివడిగా చర్యలు చేపట్టారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరులో అన్నక్యాంటిన్ ప్రారంభమైంది. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మూత పడింది. పలుమార్లు టీడీపీ నాయకులు మున్సిపల్ అధికారులను కలిసి క్యాంటీన్‌ను తామే నిర్వహిస్తామన్నా ససేమిరా అన్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ క్యాంటీన్ భవనం నిరుపయోగంగా వదిలేశారు. సచివాలయాలు అద్దెభవనంలో ప్రారంభించారే గాని కనీసం సచివాలయాన్ని కూడా ఈ భవనంలో ప్రారంభించి వినియోగించుకోలేకపోయారు. దీంతో అసాంఘిక శక్తులు ఈ భవనాన్ని దారుణంగా మార్చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన టీడీపీ అన్నక్యాంటీన్లను ఈనెల 15న తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో అధికారులు దాదాపు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి భవనానికి పూర్వ శోభ తీసుకొచ్చారు.

పెద్దిరెడ్డి అనవసర విమర్శలు మానుకోవాలి:చల్లాబాబు



రొంపిచెర్ల,ఆగస్టు7: జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల వల్ల రాష్ట్రం, జిల్లా అభివృద్ధి అటకెక్కిందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయంలో సర్వం అవినీతిమయమైందన్నారు. ప్రగతి జాడే లేదన్నారు. అందువల్లే వైసీపీని ప్రజలు కేవలం 11 సీటకు పరిమితం చేశారన్నారు. వాస్తవాలు గుర్తించకుండా సూపర్ సిక్స్ అమలు చేయలేదని పెద్దిరెడ్డి విమర్శించడం సమంజసం కాదన్నారు. వైసీపీ పాలనలో ఖజానా ఖాళీ చేసినా సంక్షేమం, సూపర్ సిక్స్ అమలు రెండు కళ్లుగా చంద్రబాబు భావిస్తున్నారన్నారు. గత పాలనతో చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అనవసర విమర్శలు మానుకోవాలన్నారు.

ఇన్ సర్వీస్ కోటా తగ్గించిన జీవో ఉపసంహరించుకోవాలి

కుప్పం, ఆగస్టు 7: ఇన్ సర్వీస్ కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ఇచ్చిన జీవో (నంబర్ 85)ను ఉపసంహరించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను బుధవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలలో 2600 మంది వైద్యులు పనిచేస్తున్నారన్నారు. ఇన్ సర్వీస్‌ను కోటాను 15 శాతానికి తగ్గించడం వల్ల తాము అవకాశాలు కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారుల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ తరఫున పలువురు నియోజకవర్గ వైద్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, ప్రిన్సిపాల్

కుప్పం, ఆగస్టు 7: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకార కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ జీటీ.నాయుడు హెచ్చరించారు. డాక్టర్ జేమ్స్‌యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిషేధం, వాటి వల్ల సంభవించే ప్రమాదాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడడంవల్ల యువత పనికిరాకుండా పోతారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, మాదక ద్రవ్యాలు వాడినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్య సమాజం సాకారం



నర్సింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

కుప్పం, ఆగస్టు 7: తల్లిపాలతో ఆరోగ్య సమాజం సాకారం అవుతుందని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. పీఈఎస్ ఆసుపత్రి చిన్నపిల్లల విభాగంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీ మాట్లాడుతూ సహజమైన అనేక పోషకాలు కలిగిన తల్లి పాలు శిశువుకు పట్టడం వల్ల ఆరోగ్యంగా ఎదుగుతాడన్నారు.. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రనాయుడు, డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు, డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య, ప్రొఫెసర్ డాక్టర్ హరీష్, డాక్టర్ చిత్రా నాగరాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి, తదితరులు పాల్గొన్నారు. **బైరెడ్డిపల్లె** : లక్కనపల్లె, జాలారిపల్లె, నాగిరెడ్డిపల్లె, బేలుపల్లె గ్రామాల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలప్రాముఖ్యతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దౌర్జన్యం

పలమనేరు, ఆగస్టు7 : కొలమాసనపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరమేష్‌పై కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారు. వన్యప్రాణుల వేటకోసం కొందరు కాపు కాసినట్లు వచ్చిన సమాచారంతో పరమేష్ బుధవారం అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉన్న 10 మందిని ఆయన నిలదీయడంతో వారు దౌర్జన్యానికి పాల్పడినట్టు తెలిసింది. దౌర్జన్యం చేసిన వారతలో వినోద్, వేఖర్, మోహన్‌తో పాటు మరొకరిని గుర్తించారు. రేంజర్ శివన్న విచారిస్తున్నారు.

మాకు ఈ రేషన్ డీలర్ వద్దు

చౌడేపల్లె, ఆగస్టు7: చిట్రెడ్డిపల్లెలో చౌక దుకాణం-12వ డీలర్ తమకు వద్దంటూ ఆ గ్రామస్థులు తహసీల్దార్ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ..12వ నంబరు స్టోరుకు చెందిన డీలర్ సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో ఫిర్యాదు చేసిన గత ప్రభుత్వ వైసీపీ నాయకులు అండతో చర్యలు తీసుకోలేదన్నారు. ఈ డీలర్ వద్ద రేషన్ తీసుకోకుండా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా రత్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు, ఆగస్టు7 : ప్రభుత్వ పెన్షనర్ల సంఘ పలమనేరు అధ్యక్షుడిగా రత్నారెడ్డిని ఎన్నుకొన్నారు. బుధవారం సంఘ గౌరవాధ్యక్షుడు నల్లారెడ్డి అధ్యక్షతన పెన్షనర్లు సమావేశమయ్యారు. సంఘ అధ్యక్షుడిగా ఉంటూ ఇటీవల మృతి చెందిన మనోహరరెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ 1న పెన్షన్లు చెలించాలని, ఈహెచ్‌ఎస్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రత్నారెడ్డి మాట్లాడుతూ డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘ సహ అధ్యక్షులు గురుమూర్తి, విశ్రాంత డీఈఓ చంద్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రాము బాధ్యతల స్వీకారం



పుంగనూరు రూరల్, ఆగస్టు7: తహసీల్దార్‌గా రాము బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులల్లో భాగంగా కడప జిల్లా పులివెందులలో తహసీల్దార్‌గా పనిచేసి ఈయన బదిలీపై వచ్చారు. మండల రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిపాలలోనే పోషక విలువలు



ఆరోగ్య సూచనలిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరం, ఆగష్టు 07 : తల్లిపాలలోనే బిడ్డకు పుష్కలమైన పోషక విలువలు ఉంటాయని స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కలగటూరు గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలు ఇస్తే అత్యంత ముఖ్యమైన పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం చూపండి

చౌడేపల్లె, ఆగస్టు7:శ్మశానవాటికకు స్థలం చూపాలని నాయునివారిపాళ్యం వాసులు తహసీల్దార్ హనుమంతుకు బుధవారం వినతి ప్రతం సమర్పించారు. గ్రామస్థులు మాట్లాడుతూ..60 సంవత్సరాలుగా ఎవరైనా మృతి చెందితే స్మశానం లేక చెరువులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు. తమకు స్మశానం కోసం స్థలం కేటాయించాలని కోరారు. మాల మహానాడు మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, నాయకులు రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు



బైరెడ్డిపల్లె, ఆగస్టు 7 : స్థానిక శేషాద్రిస్వామి ఆలయ ఆవరణలో బుధవారం జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి రమాదేవి ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనంజయగౌడ్‌ను నిర్వాహకులు సత్కరించారు. వైద్యులు శశిధర్, వెంకటరమణ, వెంకటేష్, పీఆర్వో భార్గవ్‌చంద్ర, సిబ్బంది యామిని, ధరణి, భువనేశ్వరి, జానపద వృత్తి కళాకారుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

చినుకు పడితే అడుగు పెట్టడం కష్టమే





రొంపిచెర్ల బస్టాండ్‌లో గుంతల్లో నీటి నిల్వ - సంతగేటు వద్ద నీటితో నిండిన గుంతలు

రొంపిచెర్ల, ఆగస్టు7: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో వర్షం పడితే గుంతల్లో నీరు చేరి వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడికి చిత్తూరు, పీలేరు, పుంగనూరు డిపోల బస్సులు వస్తుంటాయి. గుంతల్లో నీరు చేరి దోమల విజృంభిస్తున్నాయి. ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉంది. అలాగే పుంగనూరు నుంచి తిరుపతి వస్తున్న కొత్త సర్వీసులు రొంపిచెర్ల పట్టణంలోకి వచ్చి వెళ్లెలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చౌడేపల్లె: చినుకు పడితే స్థానిక సంతగేటు వద్ద రోడ్డు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. మంగళవారం రాత్రి మోస్తరు వర్షానికే అడుగు లోతు నీరు నిలిచింది. దీంతో రాక పోకలకు ఇబ్బంది కలిగింది. మురుగు కాలువలు లేకపోవటం, రోడ్డు కుచించుకు పోవటం, గుంతలు ఏర్పడటంతో అక్కడి వారు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వారే మట్టిని తోలుకున్నారు. రోడ్డుపై అడుగు మేర గుంతల్లో వర్షపు నీరు నిలవటంతో లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు తరచూ పడి గాయాలపాలవుతున్నారు.

బాలికల కళాశాల మైదానం మాయం

- 7.32 ఎకరాల్లో ఉన్నది ఎకరా లోపే
- పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారం ఆక్రమణలు
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థినులు



క్రీడా మైదానంలో ఉన్న బండరాళ్లు



మైదానంలో నిర్మించిన ఆవుల షెడ్డు

వెదురుకుప్పం, ఆగస్టు 6: పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాల(బాలికల) మైదానం మాయమైంది. కళాశాల లెక్కల ప్రకారం సర్వే నంబర్లు 222, 222/1,222/2తో 7.32 ఎకరాల స్థలం క్రీడా మైదానంగా కేటాయించారు. ప్రారంభంలో ఇది విద్యార్థినులు ఆడుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉండేది. రానురాను పచ్చికాపల్లం ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో కబ్జాదారుల కన్నుపడింది. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కలసి రావడంతో స్థానికంగా ఉండేవారు ఇష్టానుసారంగా ఆక్రమణలు మొదలుపెట్టారు. ఆక్రమణలతో సరిపెట్టుకోక శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కళాశాలలో 400 మంది విద్యార్థినులు చదువుతున్నారు. అన్ని వసతులు ఉన్నప్పటికీ మైదానం లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు. 7.32 ఎకరాల స్థలం ఎకరా లోపే దర్శనమిస్తోంది. అది కూడా చదునుగా లేదు. గుట్టలు, గుట్టలుగా బండరాళ్లు దర్శనమిస్తున్నాయి.

క్రీడా మైదానం హద్దులు చూపించాలి



కళాశాల క్రీడా మైదానం చాలా వరకు ఆక్రమణల్లో ఉంది. ఉన్నది కూడా క్రీడలకు అనుకూలంగా లేదు. విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెవెన్యూ అధికారులు స్పందించి మైదానం హద్దులు చూపించాలి. అందులో ఉన్న ఆక్రమణలను తొలగించాలి. - సిద్దయ్య, హెడ్మాస్టర్

30 ఏళ్ల క్రితం షెడ్ వేసుకున్నాను



నేను 30 ఏళ్ల క్రితం ఇక్కడ పాడి ఆవుల కోసం షెడ్డు నిర్మించుకున్నాను. దాన్ని తొలగిస్తే ఆవులకు షెల్టర్ లేకుండా పోతుంది. మైదానంలో ఉన్న ఆక్రమణలన్నీ తొలగిస్తే ఆలోచిస్తాను. ఏళ్ల తరబడి నా ఆధీనంలో ఉన్న స్థలాన్ని వదులుకోను. - భాస్కర్‌రెడ్డి, పచ్చికాపల్లం

నేడు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

చిత్తూరు, ఆగస్టు 7: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 9849907885కు ఫోన్ చేసి, నేరుగా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 7: చిత్తూరు ఒకటో పట్టణ సీఐగా జయరామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న విశ్వనాథరెడ్డిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది. ఆయన స్థానంలో పలమనేరు రూరల్ సీఐగా పనిచేస్తున్న జయరామయ్యను బదిలీ చేసింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చిత్తూరు, ఆగస్టు 7: ఈనెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమాధికారి మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి గిరిజన సంఘాల నేతలు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

జిల్లా స్థాయిల్లో ఉర్దూ సదస్సులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ మీడియాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లా స్థాయి ఉర్దూ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునీర్, సాలేహాలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1997లో అప్పటి సీఎం చంద్రబాబు ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉర్దూ విద్యా వ్యవస్థకు ఊపిరి పోశారని తెలిపారు. 2025లోనూ ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి, పాఠశాలల్లో అవసరమైన ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

వర్షపు నీటిని రోడ్డుపైకి మళ్లించారు



సిమెంట్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 7: వర్షపు నీటిని రోడ్డుపైకి మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వైనమిది. చిన్నవేపంజేరి పంచాయతీ మంగినాయనికుప్పం మీదుగా మహదేవమంగళం, తిరువీధికుప్పం, కడపగుంట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మంగినాయనికుప్పం వద్ద రహదారిలో సిమెంట్ రోడ్డు ఓ చోట పల్లంగా ఉంది. వర్షం కురిసినప్పుడు నీరు అటుగా వెళ్లిపోయేది. గ్రామంలో ఇద్దరి మధ్య ఏర్పడిన వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో ఆ నీరు పల్లపు ప్రాంతానికి వెళ్లనీయకుండా మట్టి అడ్డుగా పోశారు. ఈ క్రమంలో నీరు సిమెంట్ రోడ్డుపై నిలిచిపోయి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సర్పంచ్ భూన్సీ హేమశేఖర్‌రెడ్డి మట్టి అడ్డుగా పోసిన వ్యక్తికి నచ్చజెప్పినా లాభం లేకపోయింది. 'నీరు నా జాగాలోకి రాకుండా ఏమైనా చేసుకోండి' అని తేల్చిచెప్పడంతో అవాక్కవడం అధికారుల వంతైంది.

తవణంపల్లె తహసీల్దార్‌గా సుధాకర్



సుధాకర్‌ను అభినందిస్తున్న రెవిన్యూ సిబ్బంది

తవణంపల్లె, ఆగస్టు 7: తవణంపల్లె తహసీల్దార్‌గా సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఐరాల డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై తవణంపల్లె తహసీల్దార్‌గా వచ్చారు.

మామిడి బోర్డు ఏర్పాటుకు వినతి



చంద్రబాబుకు వినతి ఇస్తున్న పద్మనాభనాయుడు

తవణంపల్లె, ఆగస్టు 7: జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ హార్టికల్చర్ యూనివర్సిటీ మాజీ బోర్డు సభ్యులు పద్మనాభ నాయుడు సీఎం చంద్రబాబుకు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో రూ.3 లక్షల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారని, 70 వరకు మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు ఉన్నప్పటికీ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. మామిడి బోర్డు ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

పెనుమూరు, ఆగస్టు 7: మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ సుబ్రమణ్యం సూచించారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్, రైతుల పొలాల్లో ఫాంపాండ్, రోడ్డుకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్లతోటల పెంపకం, పూలసాగులో అవగాహన కల్పించాలని కోరారు. ఏపీవో గుణశేఖర్, ఈసీ సతీష్, టీఏ వినోద్ పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు క్లోరినేషన్ పరికరం



బోరుకు పరికరం ఏర్పాటు చేస్తున్న అధికారులు

పాలసముద్రం, ఆగస్టు 7: తాగునీటి బోర్లకు ఇన్‌లైన్ క్లోరినేషన్ పరికరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న బోరుకు బుధవారం పరికరాన్ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఈ పరికరం ద్వారా 0.2 పీపీఎం సాంద్రత కలిగిన క్లోరినేటెడ్ నీటిని సరఫరా చేసే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, పాలసముద్రం పంచాయతీ కార్యదర్శి ధరణిప్రసాద్ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

పాలసముద్రం, ఆగస్టు 7: ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు పెంచుకోవచ్చని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ పండ్ల తోటలు, మల్బరీ సాగు చేసే రైతులను గుర్తించాలన్నారు. ఐదెకరాల కంటే తక్కువ భూములున్న వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను ఉపాధి కార్యాలయంలో అందజేస్తే నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ఏపీవో మార్గరెట్, ఈసీ అనూష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



పూతలపట్టు, ఆగస్టు 7: పూతలపట్టు చెరువు కట్టపైన వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి డ్వామా పీడీ రాజశేఖర్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారి పక్కనున్న చెరువు కట్టను పరిశీలించారు. టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి ఆయన వెంట ఉన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

శ్రీరంగరాజపురం, ఆగస్టు 7: తల్లిపాలే శిశువుకు ఆరోగ్యమని ఆరిమాకులపల్లె ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ గౌరి అన్నారు. మండలంలోని విలాసవరహాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గంగమ్మగుడిలో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పౌష్టికాహారంపై అవగాహన



పూతలపట్టు, ఆగస్టు 7: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎర్రచెరువుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు, పౌష్టికాహారంపై ఐసీడీసీ అధికారి పరిమళ గర్భిణులకు సలహాలిచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరేం?



పెచ్చులూడిన వాటర్ ట్యాంకు

వెదురుకుప్పం, ఆగస్టు 7: పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాల (బాలికల) ఆవరణలో గ్రామం కోసం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలస్థితికి చేరుకుని పెచ్చులూడి పడుతోంది. ఈ విషయాన్ని గుర్తించి ఉన్నత కళాశాల ఉపాధ్యాయ బృందం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఇక్కడ నాలుగు వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని ఆ ట్యాంకును తొలగించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

వెదురుకుప్పం, ఆగస్టు 7: ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కార్వేటినగరం సీఐ సత్యబాబు హెచ్చరించారు. బుధవారం వెదురుకుప్పం వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద అధ్యక్షతన ర్యాగింగ్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌పైనా అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకటకృష్ణ, కళాశాల యాంటీ ర్యాగింగ్ విభాగం సమన్వయకర్త బి.సతీష్‌కుమార్, డాక్టర్ శంకర్‌రెడ్డి, ఐక్యూస్ కో-ఆర్డినేటరు డాక్టర్ పి.వెంకటేష్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలనే ధరిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి

వెదురుకుప్పం, ఆగస్టు 7: చేనేత వస్త్రాలను ధరించి చేనేత పరిశ్రమను ప్రోత్సహిద్దామని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి అన్నారు. బుధవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి

చిత్తూరు సిటీ, ఆగస్టు7: తమ భూమిని కాజేయాలని కొందరు కుట్ర చేస్తున్నారని, అడ్డుకుంటే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, రక్షణ కల్పించాలని ఎస్ఆర్ పురం మండలం వడ్డి కండ్రిగకు చెందిన కృష్ణయ్య కోరారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న సెటిల్మెంట్ భూమిని అదే గ్రామానికి చెందిన జగన్నాథం, వరదయ్య, రెడ్డెప్ప, నరసింహులు, కృష్ణయ్య, భాస్కర్, శంకరయ్య, లోకేష్ కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అడ్డుకున్న తన కుటుంబ సభ్యులపై భౌతిక దాడులు చేసి, గాయపరిచారని పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. కలెక్టర్, ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించండి

చిత్తూరు సిటీ, ఆగస్టు7: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను టౌన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ షణ్ముగం కోరారు. బుధవారం ఆయన తాడేపల్లెలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. గత ప్రభుత్వ విధానాలతో జిల్లాలోని వసతి గృహాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆదరణ పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని కోరారు.

వైభవంగా దీపపు పూజ



నగరి, ఆగస్టు 7 : చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా బుధవారం దీపపు పూజ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని 750 మంది మహిళలు దీపాలతో ఊరేగింపుగా ఆలయంలోకి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఉత్సవ మండపం వద్ద నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ అందించిన అమ్మవారి చిత్రపటాల ముందు దీపాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు కుంకుమ ప్రసాదాలు అందించారు.

నగరి మండలాభివృద్ధికి సమష్టి కృషి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 7: రాజకీయాలకతీతంగా సమష్టిగా నగరి మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. నగరి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భార్గవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి, పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 32 పనులను గుర్తించి మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం అనుసంధానంతో రోడ్డు పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. పామోలిన్ సాగుపై అధిక సబ్సిడీలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పామోలిన్ సాగు చేపట్టి 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు సబ్సిడీ అందలేదని, పెంపకంపై అవగాహన కల్పించలేదని అయనంబాకం గ్రామ రైతు సురేషనాయుడు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ రవికుమార్, జడ్పీటీసీ గాంధీ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో ఆధార్‌కార్డులు..ఉత్తరాలు



గుడిపాల, ఆగస్టు 7: ఉత్తరాలు, ఆధార్‌కార్డులు, బ్యాంకు నోటీసులను పోస్టల్ అధికారులు చెత్తకుప్పలో పడేసిన ఘటన మండలంలోని పాపిశెట్టిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల మేరకు.. బుధవారం పాపిశెట్టిపల్లె క్రాస్ నుంచి రాసనపల్లె కట్టపై రోడ్డు కిరువైపులా పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా ఉత్తరాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు నోటీసుల తదితర పత్రాలు చెత్త కుప్పలో పడి ఉండడం జనసేన మండల మాజీ అధ్యక్షుడు హేమాద్రి గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేంద్రకుమార్ వాటిని పరిశీలించి, పోస్టల్ అధికారులను ఫోన్‌లో సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోస్టమాన్ విధులలో నిర్లక్ష్యంగా ఉంటున్నాడని, నిర్ణీత సమయంలో ఆధార్‌కార్డులు, బ్యాంకు నోటీసులు అందకపోవడంతో నష్టపోయామని ఆరోపించారు.

మొక్కలను విరివిగా నాటించాలి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజశేఖర్

యాదమరి, ఆగస్టు 7: వర్షాలు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం కింద మండలంలో మొక్కలను విరివిగా నాటించాలని డ్వామా పీడీ రాజశేఖర్ చెప్పారు. మండలంలోని జంగాలపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. మాధవరం పంచాయతీలో ఫిష్‌పాండ్ పనులను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల ఆవరణల్లో మొక్కలను నాటించాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలన్నారు. ఏపీడీ సుబ్రహ్మణ్యం, అదనపు ప్రోగ్రామ్ అధికారి బాల పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నిండ్ర, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవోలు వసుమతి, శ్రీధర్‌రాజు తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం 46 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పాఠశాలలను నాలుగు రూట్‌లుగా విభజించామని, మొదటి రూట్‌కు ఎంపీడీవో, రెండవ రూట్‌కు తహసీల్దారు, మూడవ రూట్‌కు ఎంఈవో 1, నాలుగో రూట్‌కు ఎంఈవో 2 టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. పర్యవేక్షకులుగా వీఆర్వో, వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కేటాయించిన పాఠశాలల్లో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని కోరారు.

చెంగల్రాయనాయుడు కాలువ పరిశీలన



బంగారుపాళ్యం, ఆగస్టు 7: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి తగ్గువారిపల్లె పంచాయతీ చెంగల్రాయనాయుడు కాలువ పొంగి నీరు పక్కనే ఉన్న హాస్టల్‌లోకి ప్రవేశించిన విషయం విదితమే. బుధవారం ఆర్ అండ్‌బీ డీఈ గోవర్ధన్, ఇరిగేషన్ ఏఈ కిశోర్ కాలువను పరిశీలించారు. అక్రమ నిర్మాణాల కారణంగా కాలువ కుచించుకుపోయిందన్నారు. దానికితోడు కాలువలో చెత్త పేరుకుపోవడంతో నీరు హాస్టల్‌పై వెళ్లిందని గుర్తించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏఈలు ఆదికేశవులు, ఖాదర్‌బేగ్, విశ్వనాథనాయుడు వారి వెంట ఉన్నారు.

కాయలు కోసిన వెంటనే కొమ్మలు కత్తిరించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

వెదురుకుప్పం, ఆగస్టు 7 : మామిడిలో కాయలు కోసిన వెంటనే కొమ్మల కత్తిరింపు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లెలో మామిడి కోతల అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కొమ్మల కత్తిరింపు ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయో జనాలను వివరించారు. కొమ్మలు కత్తిరింపు ఎలా చేయాలి, ఎరువులు ఏ మోతాదులో వేయాలి, దున్నకాలు ఎప్పుడు చేపట్టాలో రైతులకు విశదీకరించారు. ఐదు ఎకరాల్లోపు వారికి డ్రిప్‌పై 90 శాతం, స్ప్రింక్లర్లపై 55 శాతం, ఐదు నుంచి పది ఎకరాల లోపు వారికి డ్రిప్‌పై 70 శాతం, స్ప్రింక్లర్లపై 45 శాతం రాయితీ ఇస్తున్నారని చెప్పారు. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారిణి వింధ్య, వ్యవసాయాధి కారిణి వనిత, మండల రైతు సంఘ అధ్యక్షులు పెద్దిరెడ్డిగారి ఉమాచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించండి

విజయపురం, ఆగస్టు 7: మండలంలోని పాతార్కాడులో ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం తహసీల్దార్ కిరణ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య, ఏసుపాదం, రవి, పరిమళ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, ఆగస్టు 7: మండలంలోని బూచివానత్తం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డు హెచ్ఎం చంద్రయ్య బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, క్రయన్స్, పెన్నులు, పెన్సిల్ తదితర సామగ్రి అందించారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి తనవంతు సాయం అందిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు చలపతి, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్



అన్నదానం చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, ఆగస్టు 7: పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు జీజేఎం ట్రస్టు వ్యవస్థాపకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. టీడీపీ నేతలు గోవింద గౌడ్, ఏలుమలై, జయదేవనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సుమంగళి పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 7: స్థానిక పొన్నియమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారికి ఆడినెల సుమంగళి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకం చేశారు. గాజులతో విశేష అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. పూజలనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



గుడిపాల, ఆగస్టు 7: గుడిపాల తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న విజయలక్ష్మి అనంతపురం జిల్లాకు బదిలీకాగా ఆమె స్థానంలో నంద్యాల నుంచి చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు.

రెవిన్యూ సమస్యలను పరిష్కరించండి

గుడిపాల, ఆగస్టు 7: మండలంలోని రెవిన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి నాయుడు, జనసేన, బీజేపీ నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విన్నవించారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.

ఇసుక టిప్పర్, జేసీబీ సీజ్

గుడిపాల, ఆగస్టు 7: మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో నిల్వ ఉంచిన ఇసుకతోపాటు జేసీబీ, టిప్పర్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. పానాటూరు వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు చేశామని, జేసీబీ ద్వారా టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తుండగా సీజ్ చేసి, కేసు నమోదు చేశామని చెప్పారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

నగరి, ఆగస్టు 7 : నగరి టవర్‌క్లాక్ వద్ద, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం వైభవంగా నిర్వహించారు. చేనేత వస్త్రాలు భారతీయ సంప్రదాయ కళలకు ప్రతిబింబాలుగా మహిళా మోర్చా నాయకురాలు నిషిదరాజు అభివర్ణించారు. నగరి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో వ్యవసాయం తర్వాత చేనేతకు ప్రముఖ స్థానం ఉందన్నారు.



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. నియోజకవర్గ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పలు విషయాలపై చర్చించారు. - చిత్తూరు కలెక్టరేట్